01ATP14F_01ATP14F.qxd 14-10-2024 PM 10:55 Page 1

అనంతపురం/శ్రీ సత్యసాయి
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
మంగళవారం 15 అక్టోబర్ 2024 పేజీలు : 04

# తెలుగు తమ్ముళ్లకే "కిక్"

- హిందూపురంలో మద్యం సిండికేట్
- లేపాక్షి షాపు లాటరీ విజేత కిడ్నాప్ కలకలం హైడ్రామా



**హిందూపురం, అక్టోబర్ 14 ప్రభాతవార్త**

తాము కోరుకున్న విధంగానే హిందూపురంలో అధికార తెలుగుదేశం పార్టీకి చెందిన కార్యకర్తలకే మద్యం షాపులు లాటరీలో దక్కాయి. హిందూపురం నియోజకవర్గంలో అధికార పార్టీకి చెందిన వారు కాకుండా ఇతరులు ఎవరూ మద్యం షాపులకు దరఖాస్తు చేయకూడదని అనధికారికంగా హుంకుజారీ చేశారని ప్రచారం వున్నప్పటికి లేపాక్షి మద్యం షాపును చిలమత్తూరు మండలం యగ్నిశెట్టిపల్లికి చెందిన రంగనాథ్ దరఖాస్తు చేయగా సోమవారం పుట్టపర్తిలో అధికారులు నిర్వహించిన లాటరీలో షాపు అతనికి దక్కింది. దీంతో ఖంగుతిన్న ఆ పార్టీకి చెందిన కొందరు అందరూ చూస్తుండగానే బలవంతంగా రంగనాథ్‌ను ఒక వాహనంలో ఎక్కించుకుని తీసుకెళ్లిపోయారు. విషయం తెలుసుకున్న రంగనాథ్ తండ్రి ఓబులేసు, భార్య అశ్విని అక్కడే ఆందోళనకు దిగారు. కిడ్నాపర్లబారి నుండి తన భర్తను విడిపించాలని కోరుతూ ఆమె పుట్టపర్తి పోలీసులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. సోమవారం సాయంత్రం హిందూపురం ఒన్‌టౌన్ పోలీసుస్టేషన్‌కు వచ్చిన రంగనాథ్ సిఐ రాజగోపాల్‌నాయుడు ఎదుట తనను ఎవరూ కిడ్నాప్ చేయలేదని చెప్పడంతో హైడ్రామా చోటు చేసుకుంది. మరోవైపు హిందూపురంలో మద్యం దుకాణాలను అధికారపార్టీకి చెందిన నాయకులందరూ సిండికేట్‌గా ఏర్పడి పంచుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. అయితే మద్యం షాపుల కోసం దరఖాస్తులు చేసే సమయంలో ప్రభుత్వ ఆదాయానికి నష్టం జరగకుండా ఒక్కో దరఖాస్తుకు 2 లక్షల చొప్పున అత్యధిక సంఖ్యలో దరఖాస్తులు చేసేలా జాగ్రత్త పడ్డారు. తొలుత ఒక్కో షాపుకు 30 దరఖాస్తులు వేయాలని చెప్పినప్పటికి చాలా మంది వ్యతిరేకంగా వాటి సంఖ్య తగ్గించారు. షాపులకు సంబంధించి ఎవరెవరికి ఎంత పర్సెంటేజ్ ఆదాయం తీసుకోవాలన్నది మంగళవారం నిర్ణయించనున్నట్లు తెలిసింది. కాగా హిందూపురం ఎక్సైజ్ పోలీసుస్టేషన్ పరిధిలో ప్రభుత్వానికి భారీ ఆదాయం సమకూరింది. 11 షాపులకు గాను 271 దరఖాస్తులు రాగా 5.42 కోట్ల ఆదాయం వచ్చింది. అంతేకాకుండా లాటరీలో షాపులు దక్కించుకున్న వారి నుండి 15 కోట్లకు పైగా ఎక్సైజ్‌శాఖకు ఆదాయం వచ్చింది.

# సజావుగా సాగిన మద్యం షాపుల లాటరీ ప్రక్రియ



లాటరీ ప్రక్రియను చేపడుతున్న జాయింట్ కలెక్టర్ శివనారాయణశర్మ

**అనంతపురం ఓల్డ్‌టౌన్, అక్టోబర్ 14 ప్రభాతవార్త**

నూతన మద్యం పాలసీలో భాగంగా కొత్త మద్యం షాపులు ఏర్పాటు చేయడానికి దరఖాస్తులు చేసుకున్న ఆశావాహులకు లాటరీ ప్రక్రియ ద్వారా షాపుల ఏర్పాటుకు సోమవారం నిర్వహించిన లాటరీ ప్రక్రియ సజావుగా సాగింది. అనంతపురం జెఎన్‌టియులోని ఎన్‌టిఆర్ ఆడిటోరియంలో అనంతపురం జిల్లా పరిధిలోని 136 షాపులకు 3265 మంది ఆశావాహులు దరఖాస్తులు చేసుకోగా జిల్లా జాయింట్ కలెక్టర్ శివనారాయణశర్మ సమక్షంలో లాటరీ ప్రక్రియ నిర్వహించి షాపుల కేటాయింపు చేశారు. ఉదయం 7 గంటలకు ప్రారంభమైన లాటరీ ప్రక్రియ మధ్యాహ్నం 3 వరకు సాగింది. తొలుత అనంతపురం మున్సిపాలిటీ పరిధిలోని 30 షాపులకు లాటరీ ప్రక్రియ నిర్వహించగా ఆశావాహులు పెద్దఎత్తున హాజరయ్యారు. సనపరెడ్డి సుజల అనే మద్యం వ్యాపారికి అత్యధికంగా 4 షాపులు దక్కాయి. ఇందులో అనంతపురం మున్సిపాలిటీలో 2, గుంతకల్లు మున్సిపాలిటీలో 1, కళ్యాణదుర్గం రూరల్ ప్రాంతంలో ఒక షాపు లభించాయి. వీరి తరువాత తాడిపత్రి మున్సిపల్ పరిధిలో మద్యం షాపులకు కాకర్ల రంగనాథ్‌కు 3 షాపులు, కాకర్ల రంగనాయకులుకు 2 షాపులు, అనంతపురం మున్సిపాలిటీ పరిధిలోని గంగారం అనే వ్యక్తికి 2 షాపులు, పెద్దవడుగూరు మండలానికి చెందిన పి.నాగేశ్వర్‌రెడ్డికి 2 షాపులు, గుంతకల్లు మున్సిపాలిటీలో ఆర్.శ్రీదేవికి 2 షాపులు, గుంతకల్లు మున్సిపాలిటీ, రూరల్ ప్రాంతాల్లో కె.అశోక్ అనే వ్యక్తికి 2 షాపులు, దక్కించుకున్నారు. ఎంతో ఉత్కంఠగా సాగాల్సిన మద్యం లాటరీ ప్రక్రియ చాలా సప్పగా సాగిందని పలువురు వ్యాపారులు గుసగుసలాడుకుంటూ కనిపించారు. మద్యం వ్యాపారులు సిండికేట్ కావడం తమ అనుచరులు మాత్రమే మద్యంషాపులకు దరఖాస్తు చేసుకోవాలని ప్రజాప్రతినిధులు అల్టిమేటం జారీ చేయడం ఇందుకు ప్రధాన కారణమని వారిలో వారు చర్చించుకున్నారు.

**షాపు నీకే వచ్చినా..మేమే నడుపుతాం :**

అనంతపురం అర్బన్ నియోజవర్గానికి దగ్గరగా వుండి మహిళా ప్రజాప్రతినిధి ప్రాతినిధ్యం వహిస్తున్న మరొక నియోజకవర్గంలోని మండల కేంద్రంలోని షాపుకు ఓ మహిళకు లాటరీలో షాపు దక్కగా సదరు నియోజకవర్గం ఎమ్మెల్యే అనుచరులు అధికారుల సమక్షంలోనే ఆమెతో బేరసారాలు కుదుర్చుకోవడానికి తీవ్ర ప్రయత్నాలు చేశారు. లాటరీలో పాల్గొన్న సదరు మహిళ ప్రభుత్వ ఉద్యోగి అంటూ ఆమెకు షాపు కేటాయించడానికి వీలు లేదంటూ రిజర్వ్2లో షాపు పొందిన వ్యాపారి అభ్యంతరం వ్యక్తం చేయడంతో సదరు మహిళ తాను ప్రభుత్వ ఉద్యోగిని కాదని నిరూపించుకోవాల్సి వచ్చింది. అయినప్పటికి షాపు నీకు వచ్చినా మేమే నడుపుతామంటూ సదరు ప్రజాప్రతినిధి అనుచరులు మహిళా వ్యాపారిపై హుకుం జారీ చేశారు. లాటరీ ప్రక్రియలో షాపు వరించిన వారిని సాదరంగా ఆహ్వానించి వారి చేత ప్రభుత్వ నియమ నిబంధనలంటిని పూర్తి చేయించే బాధ్యతను ఎక్సైజ్‌శాఖ సిబ్బంది నిర్వహిస్తున్నారు. కానీ లాటరీలో షాపు వరించినప్పటికి సదరు మహిళ వ్యాపారి పట్ల ఎక్సైజ్‌శాఖ సిబ్బంది వ్యవహరించిన తీరు ఆశ్చర్యానికి గురిచేస్తుంది. చివరికి వారి ప్రయత్నాలు విఫలం కావడంతో ఆమెకు భయభ్రాంతులకు గురి చేయాలని చూశారు. సాక్ష్యాత్తు జిల్లా అధికారులు అందరూ వున్న వేదిక మీదనే ఇంత తంతు నడుస్తున్నా అధికారులు ఏమాత్రం పట్టించుకోలేదని సదరు మహిళ ఆవేదన వ్యక్తం చేసింది. చివరికి వారి వేధింపులు తాళలేక షాపును వదులుకుంటున్నట్లు ఆ మహిళ పలువురి వద్ద వాపోయారు. లాటరీ ప్రారంభ సమయంలో కొంత గందరగోళం నడిచినప్పటికి అధికారులు సమన్వయంతో లాటరీ ప్రక్రియను సమర్థవంతంగా ముందుకు నడిపారు. లాటరీ ప్రక్రియను జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్ ప్రత్యక్షంగా పరిశీలించి లాటరీలో పాల్గొన్న మహిళలతో ముచ్చటించారు.



అధికారులతో మాట్లాడుతున్న బాధిత మహిళ

# అన్నా క్యాంటీన్లను ప్రారంభించడం శుభ పరిణామం

- అధికారం చేపట్టిన నెలలోపే ఇచ్చిన హామీలను నెరవేర్చాం.. - హిందూపురం ఎంపి బికె. ఎమ్మెల్యే కందికుంట



అన్నా క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్న ఎంపి, ఎమ్మెల్యే



ప్రజలకు భోజనం వడ్డిస్తున్న ఎమ్మెల్యే

**కదిరి, అక్టోబర్ 14 ప్రభాతవార్త**

పేదల ఆకలి తీర్చే అన్నా క్యాంటీన్‌ను ప్రారంభజంచడం శుభ పరిణామం అని హిందూపురం పార్లమెంట్ సభ్యులు బి.కె.పార్థసారధి, ఎమ్మెల్యే కదికుంట వెంకట ప్రసాద్ అని పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని ఆర్ అండ్ బి అతిథి గృహ సమీపంలో అన్నా క్యాంటీన్‌ను ఎంపి, ఎమ్మెల్యే ప్రారంభించారు. అంతకంటే ముందు స్వర్గీయ నందమూరి తారకరామారావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి అక్కడి ను ంచి టిడిపి శ్రేణులతో కలిసి భారీ ర్యాలీగా అన్నా క్యాంటీన్ వద్దకు వచ్చి అన్నా క్యాంటీన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపి, ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్‌లు మాట్లాడుతూ.. అధికారం చేపట్టిన నెలలోపే ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం నెరవేర్చిందన్నారు. ప్రతిపక్షాల మాటలు నమ్మేపరిస్థితుల్లో ప్రజలు లేరని, అన్నారు. పోలవరం పనుల్లో కదలిక వచ్చిందని, అమరావతి నిర్మాణానికి నిధులు తీసుకొచ్చామన్నారు. హంద్రీనీవా కాలువ ద్వారా నియోజకవర్గంలోని తలుపుల, ఎన్‌పికుంట మండలాల్లోని చెరువులన్నింటికీ సాగు, తాగునీరు అందిస్తామన్నారు. గత వైసీపీ ప్రభుత్వం రాష్ట్రంలో అభివృద్ధిని విస్మరించిందని, కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక పెద్ద ఎత్తున అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజా ప్రభుత్వంగా పని చేస్తుందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కిరణ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే పార్థసారధి, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పాలవల పవన్‌కుమార్‌రెడ్డి, టిడిపి పట్టణ అధ్యక్షులు డైమండ్ ఇర్ఫాన్, వాల్మీకి సంఘం రాష్ట్ర నాయకులు బంగారు కృష్ణమూర్తి, జనసేన ఇన్‌చార్జ్ భైరవ ప్రసాద్, బిజెపి నాయకులు వేణుగోపాల్‌రెడ్డి, కార్యకర్తలు నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# అర్జీలకు నాణ్యమైన పరిష్కారం చూపించాలి



అర్జీలను స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్

**అనంతపురం కలెక్టరేట్, అక్టోబర్ 14 ప్రభాతవార్త**

అనంతపురం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవనంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ పాల్గొని ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. జిల్లా కలెక్టర్‌తో పాటు ప్రజల నుండి అర్జీలను స్వీకరించే కార్యక్రమంలో డిఆర్‌ఓ జి.రామకృష్ణారెడ్డి, డిపిఎం ఆనంద్, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రజల నుండి 253 అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వస్తున్న అర్జీలను ఎలాంటి ఆలస్యం లేకుండా త్వరితగితన పరష్కరించాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. ఎలాంటి పెండింగ్ వుంచకుండా సకాలంలో అర్జీలకు పరిష్కారం చూపించాలన్నారు. అర్జీల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. తుఫాన్ ప్రభావితంతో ఎలాంటి నష్టం జరగకుండా అధికారులు అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని ఆయా శాఖల అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిసిఇఒ వెంకటసుబ్బయ్య, వ్యవసాయశాఖ జెడి ఉమామహేశ్వరమ్మ, డిఆర్‌డిఎ పిడి ఈశ్వరయ్య, సిపిఒ అశోక్‌కుమార్, ఎల్‌డిఎం నరసింగరావు, డిపిఒ నాగరాజునాయుడు, డిఎంహెచ్‌ఒ డాక్టర్ ఈబి.దేవి, ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నాగేశ్వరరావు, సమగ్ర శిక్ష ఏపిసి నాగరాజు, హార్టికల్చర్ డిడి నరసింహారావు, జిల్లా సైనిక సంక్షేమ అధికారి తిమ్మప్ప, వికలాంగుల సంక్షేమశాఖ ఏడి రసూల్, డిటిసి వీర్రాజు, హౌసింగ్ పిడి శైలజ, బిసి వెల్ఫేర్ డిడి ఖుష్బూకొఠారి, సర్వే ఏడి రూప్లనాయక్, మార్కెటింగ్ ఎడి చౌదరి, హెచ్‌ఎల్‌సి ఎస్‌ఇ రాజశేఖర్, ఆర్టీసి రీజినల్ మేనేజర్ సుమంత్ ఆర్.ఆదోని, పిజిఆర్‌ఎస్ తహశీల్దార్ వాణిశ్రీ, కలెక్టరేట్ ఏఇ అలెగ్జాండర్, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# మద్యం టెండర్‌లో కలకలం రేపిన కిడ్నాప్



రంగనాథ్ (ఫైల్ ఫోటో)



ధర్నా చేస్తున్న రంగనాథ్ కుటుంబ సభ్యులు

**పుట్టపర్తి టౌన్ అక్టోబర్ 14 ప్రభాతవార్త**

సత్యసాయి జిల్లా కేంద్రమైన పుట్టపర్తి పట్టణంలో చిలమత్తూరు వ్యక్తి కిడ్నాప్ కలకలం రేపింది.సోమవారం జిల్లా వ్యాప్తంగా మద్యం దుకాణాలకు టెండర్ ప్రక్రియలో భాగంగా పట్టణంలోని సాయిఆరామం అతిధి గృహంలో లాటరీ నిర్వహించారు.ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ టిఎస్ చేతన్, జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్,డిఆర్‌ఓ కొండయ్య,ఆర్డీఓ సువర్ణ,ఎక్సైజ్ అధికారులతో కలిసి ఈ కార్యక్రమం నిర్వహించారు.ఇందులో భాగంగా నియోజకవర్గాల వారిగా లాటరీ నిర్వహించారు.హిందూపురం నియోజకవర్గం చిలమత్తూరు మండలం ఎగ్గిలి కొత్తపల్లి గ్రామానికి చెందిన రంగనాథ్ అనే వ్యక్తి లేపాక్షి మండలానికి సంబం ధించిన షాప్ నెంబర్ 57 కు దర ఖాస్తు దాఖాలు చేశారు.లాటరీలో ఆయన పేరు రావడంతో ఇది జీర్ణించు కోలేని లేపాక్షి స్థానిక టిడిపి నాయ కులు ఆయనను కిడ్నాప్ చేశారు. దీంతో ఆయన భార్య అశ్విని బంధు వులతో కలిసి పుట్టపర్తి అర్బన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.ఉదయం నుంచి సాయంత్రం వరకు పోలీసులు చుట్టూ తిరిగిన తమకు న్యాయం జరగలేదని సాయి ఆరామం గేటు వద్ద బైఠాయించి ఆయన బంధువులు ధర్నా నిర్వహించారు, రంగనాథ్ తండ్రి ఓబుళేషు మాట్లాడుతూ కిడ్నాప్ చేసిన వ్యక్తులు తన కుమారుడు టెండర్ వదిలేయాలని 10 లక్షలు గుడ్ విల్ ఇస్తామని, ప్రతినెల 15 వేలు భరణం ఇస్తామని తెలిపారన్నారు.ధనికులకు ఒక న్యాయం పేదలకు ఒక న్యాయమా అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా తమకు న్యాయం చేయాలని ఆయన కోరారు.భార్య అశ్విని మాట్లాడుతూ తమకు ఎలాంటి టెండర్ అవసరం లేదని తమ భర్తను వదిలేయాలని కోరుతున్నామన్నారు.

# జిల్లాలో 135 మద్యం దుకాణాలకు లాటరీ ప్రక్రియ



జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్

**అనంతపురం కలెక్టరేట్, అక్టోబర్ 14 ప్రభాతవార్త**

జిల్లాలో 136 మద్యం దుకాణాలకు లాటరీ ప్రక్రియ చేపట్టడం జరిగిందని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ పేర్కొన్నారు. సోమవారం నగరంలోని జెఎన్‌టియు ఆడిటోరియంలో మద్యం దుకాణాల లాటరీ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసినట్లు వెల్లడించారు. ఈ ప్రక్రియను ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఉదయం 8 గంటలకు ప్రారంభమైన లక్కీ డిప్ ప్రక్రియను జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్, జాయింట్ కలెక్టర్ శివ్‌నారాయణశర్మ, జిల్లా ఎస్‌పి జగదీష్‌ల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రశాంతంగా పారదర్శకంగా మద్యం దుకాణాల కేటాయింపు లక్కీడిప్ ప్రక్రియ చేపట్టినట్లు తెలిపారు. ఆయా షాపులకు టెండర్లు దాఖలు చేసిన దరఖాస్తుదారుల సమక్షంలోనే లక్కీడిప్ తీసి షాపు దక్కించుకున్న వారి పేరును ప్రకటించినట్లు తెలిపారు. ఒక దరఖాస్తుదారుడు ఒకే పేరు మీద మూడు లేదా నాలుగు దరఖాస్తులు చేసుకుని వుండవచ్చని, ఇక్కడ దాదాపు 2 వేల మంది హాజరైనారని, గెజిట్‌లో పొందుపరిచిన మాదిరిగా ఒక మద్యం దుకాణానికి గరిష్టంగా 47 మంది అని కొన్ని చోట్ల తక్కువగాను కొన్ని చోట్ల ఎక్కువగాను మొత్తం 136 షాపులకు యావరేజ్‌గా 24 మంది దరఖాస్తులు చేసుకున్నారన్నారు. లక్కీ డిప్ ద్వారా మద్యం దుకాణం లభించిన వ్యక్తికి ఆన్‌లైన్‌లో లాగిన్‌లో బ్యాంకు అధికారుల ద్వారా చేసి చలానా జనరేట్ చేసి కన్ఫర్మేషన్‌ను ఇవ్వడం జరిగిందని బ్యాంకు కౌంటర్లను ఓపెన్ చేయడం జరిగిందన్నారు. ఎస్‌పి ఆధ్వర్యంలో భద్రత ఏర్పాట్లు కట్టుదిట్టంగా నిర్వహించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ డిప్యూటి కమీషనర్ నాగమద్దయ్య, ఎక్సైజ్ సూపరింటెండెంట్ రామ్మోహన్‌రెడ్డి, సిఐలు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

# పారదర్శకంగా మద్యం దుకాణాలు కేటాయింపు

- జిల్లా కలెక్టర్ టి.ఎస్.చేతన్



లాటరీ ప్రక్రియ ద్వారా మద్యం టెండర్లు తీస్తున్న దృశ్యాలు



**పుట్టపర్తి(కలెక్టరేట్), అక్టోబర్ 14, ప్రభాతవార్త**

ప్రభుత్వ నిబంధనల ప్రకారం జిల్లాలో 87 మద్యం దుకాణాల ఎంపిక ప్రక్రియ పారదర్శకంగా చేపట్టినట్లు శ్రీసత్యసాయి జిల్లా కలెక్టర్ టి.ఎస్.చేతన్ తెలిపారు. సోమవారం పుట్టపర్తిలోని సాయిఅరామం ఫంక్షన్ హాలు నందు మద్యం టెండర్లకు సంబంధించి ఓపెన్ లాటరీ ప్రక్రియను జిల్లా కలెక్టర్ టి.ఎస్.చేతన్, సంయుక్త కలెక్టర్ అభిషేక్‌కుమార్‌లు పరిశీలించారు. ఈ సందర్భంగా కొన్ని మద్యం దుకాణాలకు జిల్లా కలెక్టర్, సంయుక్త కలెక్టర్లు వేరువేరుగా లాటరీ తీశారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌ఓ కొండయ్య, ఎఎస్‌పి ఆర్ల శ్రీనివాసులు, పుట్టపర్తి ఆర్‌డిఓ సువర్ణ, డిప్యూటీ అసిస్టెంట్ కమీషనర్ మునిస్వామి, జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ గోవిందనాయక్, ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ నరసింహులు, పుట్టపర్తి డిఎస్‌పి విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర ్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఓపెన్ లాటరీ ప్రక్రియలో పాల్గొనేందుకు దరఖాస్తుదారులకు ఎంట్రీపాసులు ఇచ్చామని, ఈ ప్రక్రియ కోసం రెండు కౌంటర్లను ఏర్పాటు చేశామన్నారు. కాగా ఉదయం 07:00 గంటల నుండి ఓపెన్ లాటరీ ప్రక్రియ ప్రారంభమైంది. దాదాపు 1518 దరఖాస్తులు ఎక్సైజ్ శాఖ ద్వారా స్వీకరించామని కలెక్టర్ తెలిపారు. దరఖాస్తుదారులందరి సమక్షంలో లాటరీ రూపంలో ఎంపిక ప్రక్రియ పూర్తి చేశామని, జిల్లాలో 8 ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలో 87 దుకాణాలకు నోటిఫికేషన్ ఇవ్వగా ఈ నెల 11 వరకు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించామన్నారు. ఒక్కొక్క షాపునకు ఒక్కొక్క విజయవంతమైన అభ్యర్థిని, అలాగే ఇద్దరు రిజర్వుడ్ అభ్యర్థులను లాటరీ ద్వారా నియమించామన్నారు. లాటరీలో షాపులు పొందిన వ్యక్తులు తమ మొదటి సంవత్సరం లైసెన్స్ ఫీజు మొత్తంలో 1/6 వంతు మొత్తాన్ని 48 గంటల్లో చెల్లించాల్సి ఉంటుందన్నారు. ప్రత్యేకంగా బ్యాంకర్ల సహకారంతో ఇదే ప్రాంగణంలో ఎంపికైన వ్యక్తులు చెల్లింపులు చేసే విధంగా చర్యలు తీసుకున్నామన్నారు. లాటరీ ప్రక్రియ మొత్తం వీడియో గ్రఫీ చేశామని, ఈ నెల 16 నుండి మద్యం అమ్మకాలు ప్రారంభమౌతాయని కలెక్టర్ తెలిపారు.

# అభివృద్ధి పనులతో పల్లె ప్రగతికి బాటలు వేస్తాం



పల్లె పండుగ అభివృద్ధి పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీమంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి

**కొత్తచెరువు, అక్టోబర్ 14, ప్రభాతవార్త**

పల్లెల్లో అభివృద్ధి పనులు చేపట్టడం ద్వారా ప్రగతికి బాటలు వేస్తామని ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి తెలియజేశారు. సోమవారం మండల కేంద్రమైనకొత్తచెరువులో పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా మండల వ్యాప్తంగా రూ.3.30 కోట్ల రూపాలయతో చేపట్టనున్న అభివృద్ధి నిర్మాణ పనులకు ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డిలు భూమిపూజచేశారు. ఒక వైపు వర్షం కురుస్తున్న లెక్క చేయకుండా అభివృద్ధి పనులకు ఎమ్మెల్యేశంకుస్థాపన చేయడం విశేషం. మండల కేంద్రమైనకొత్తచెరువుతో పాటు లోచర్ల పంచాయతీలో మల్యే అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, తమ కూటమిప్రభుత్వం అధికారంలోకి రాగానే పంచాయతీల అభివృద్ధి కోసం రూ.4500 కోట్లు మంజూరు చేసిందని, పుట్టపర్తి నియోజకవర్గంకు రూ.20 కోట్లకుపైగా నిధులు మంజూరు చేసినట్లు తెలియజేశారు. గత 5 యేళ్ల వైసిపి పాలనలో గ్రామల అభివృద్ధి ఊసే లేదని

మిగతా 3లో...

02ATP27_02ATP27.qxd 14-10-2024 PM 10:35 Page 1



## డిఎస్సీ ఉచిత శిక్షణా తరగతులకు ధరఖాస్తు చేసుకోండి

### -ఎఎస్‌డబ్ల్యు దామోదర్

**కళ్యాణదుర్గం, అక్టోబర్ 14 ప్రభాతవార్త**

సాంఘిక సంక్షేమశాఖ, గిరిజన సంక్షేమశాఖ ద్వారా నిరుపేదలైన ఎస్సీ,ఎస్టి వర్గాలకు చెందిన ఔత్సాహికులకు ఉచిత శిక్షణా తరగతులను నిర్వహిస్తున్నట్లు షెడ్యూలు కులాల సంక్షేమం, సాధికారత అధికారులతో సంచాలకులు లావణ్యవేణి నిర్వహించిన జూమ్ మీటింగ్‌లో ఆదేశాలు జారీ చేసినట్లు జిల్లా షెడ్యూలు సంక్షేమం,సాధికారిక అధికారి కుష్బూ కోఠారి ఒక ప్రకటనలో తెలిపారు. అసక్తిగల అభ్యర్థులు జ్ఞానభూమి. ఎపి.గవర్నమెంటు.ఇన్ పోర్టల్ నందు ధరఖాస్తు చేసుకోవాలని కళ్యాణదుర్గం సహాయ సాంఘిక సంక్షేమాధికారి దామోదర్ తెలిపారు.

## అడిషనల్ క్వాంటమ్ పెన్షన్ పునరుద్ధించాలి

### -పెన్షనర్ల అసోసియేషన్ డిమాండ్

**కళ్యాణదుర్గం, అక్టోబర్ 14 ప్రభాతవార్త**


పెన్షనర్ల సంఘానికి విరాళాలు ఇస్తున్న దృశ్యం

గత ప్రభుత్వం తగ్గించిన అడిషనల్ క్వాంటమ్ పెన్షన్‌ను పునరుద్ధించాలని 12వ పిఆర్‌సిని ప్రకటించి మధ్యంతర భృతిని ఇవ్వాలని కమ్యుటేషన్ కాలాన్ని 12 సంవత్సరాలకు తగ్గించి, డిఏ బకాయిలను విడతలవారీగా చెల్లించాలని పెన్షనర్ల అసోసియేషన్ డిమాండ్ చేసింది. సోమవారం స్థానిక పెన్షన్ భవన్‌లో నిర్వహించిన కార్యవర్గ సమావేశానికి సంఘం అధ్యక్షులు శివప్రసాద్ అధ్యక్షత వహించగా, ప్రధానవక్తగా ప్రధాన కార్యదర్శి తిప్పేస్వామి మాట్లాడుతూ తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేసారు. ఈ సందర్భంగా విశ్రాంత ఉపాధ్యాయుడు బసన్న రూ.16,116లు, జి.సోమశేఖర్ రూ.5వేలను పెన్షన్ భవన నిర్మాణానికి విరాళం అందజేసారు. ఈ కార్యక్రమంలో మరెన్న, అంజినప్ప, భగవాన్ దాస్, ఫక్రుద్దీన్, చెన్నప్ప, సురేంద్ర, సత్యేంద్రనాథ్ పాల్గొన్నారు.

## ముప్పలకుంట,పిల్లలపల్లి గ్రామాలలో పల్లె పండుగ కార్యక్రమం

**బ్రహ్మసముద్రం అక్టోబర్ 14 ప్రభాతవార్త,**


పల్లె పండుగ కార్యక్రమం దృశ్యం

మండలంలోని ముప్పలకుంట, పిల్లలపల్లి గ్రామాలలో పల్లె పండుగ కార్యక్రమంను ఎంపిడీఓ నందకిశోర్ అధ్యక్షతన నిర్వహించారు. ఇదిమంచి ప్రభుత్వంలో భాగంగా పల్లె పండుగ కార్యక్రమం నిర్వహించి పలు అభివృద్ధిపనులకు భూమిపూజ కార్యక్రమంను మెదలుపెట్టడంలో భాగంగా ఉపాధి,జీవనోపాధి,గ్రామాలలో సీసీ రోడ్లనిర్మాణం,తారురోడ్ల నిర్మాణం కార్యక్రమాలకు శ్రీకారం చుట్టేకార్యక్రమంను ప్రారంభిస్తారు.ఈ కార్యక్రమంలో ఎంపిడీఓ నందకిశోర్ మాట్లాడుతూ గ్రామల అభివృద్ధిలో భాగంగా చేపడుతున్న పల్లె పండుగ కార్యక్రమంను అధికారులు నాయకులతో కలిసి పనులను నాణ్యతతో వేగవంతంగా పూర్తిచేయాలని అన్నారు.ఈ కార్యక్రమంలో మండల స్పేషల్ ఆఫీసర్ రమేష్‌నాయక్ తదితరులు అధికారులు పాల్గోన్నారు.

## పల్లె పండుగ కార్యక్రమంకు జిల్లాకలెక్టర్ రాక పనులు పరిశీలిస్తున్న కన్వీనర్

**బ్రహ్మసముద్రం అక్టోబర్ 14 ప్రభాతవార్త,**


సభాస్థలాన్ని పరిశీలిస్తున్న కన్వీనర్

మండలంలోని బుడిమేపల్లి,వేపులపర్తి గ్రామాలలో మంగళవారం పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా జిల్లాకల్టెర్ వినోద్ కుమార్, ఎంయల్ఏ అమిలినేని సురేంద్ర బాబు హాజరై ఇదిమంచి ప్రభుత్వంలో భాగంగా పల్లె పండుగ కార్యక్రమం నిర్వహించి పలు అభివృద్ధిపపనులకు భూమిపూజ కార్యక్రమంను మెదలు పెడతాలు ఈ కార్యక్రమంకు భుడిమేపల్లిలో పభాస్థలాన్ని మాజి బీటిపి కుడికాలువ అధ్యక్షుడు సుభాన్,క్లస్టర్ ఇన్‌ఛార్జ్ నాగరాజు.సభాస్థలాన్ని పరిశీలించారు.మండంలోని వేపులపర్తిలో తెలుగుదేశంపార్టీ మండల కన్వీనర్ పాలబండ్ల శ్రీరాములు కార్యకర్తలతో కలిసి సభాస్థలంలో ఏర్పాట్లను పరిశీలించారు.

## రైతులకు పప్పు శెనగ పంపిణీ చేసిన తెలుగు తమ్ముళ్లు

**కణేకల్లు, అక్టోబర్ 14 ప్రభాతవార్త:**


రైతులకు పప్పుశెనగను అందిస్తున్న తెలుగు తమ్ముళ్లు

మండల పరిధిలోని మాల్యం గ్రామం సచివాలయం నందు సుమారు నూరు మంది రైతులకు 150క్వింటాళ్ల పప్పు శెనగ విత్తనం సోమవారం తెలుగుదేశం పార్టీ నాయకులు శరబన్నగౌడ్ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాగరాజు, వేమురెడ్డి, హరి నాగేంద్ర, శర్మాస్, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శరబన్న గౌడ్ మాట్లాడుతూ పప్పు శెనగ రైతులను ఆదుకోవాలనే ఉద్దేశంతో నే కూటమి ప్రభుత్వం ముందుగానే సచివాలయాల్లో పప్పు శెనగ విత్తనం అవసరమున్న రైతుల పేర్లను నమోదు చేసుకొని సరైన సమయానికి పంపిణీ చేయడం జరిగిందన్నారు.

## తిరుపతి ట్రెక్కింగ్ క్యాంపు।లో గోల్డ్ మెడల్ సాధించిన కేటీయస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్‌సిసి క్యాడెట్

**రాయదుర్గం రూరల్, అక్టోబర్ 14 ప్రభాతవార్త:**


గోల్డ్ మెడల్ సాధించిన విద్యార్థిని అభినందిస్తున్న అధ్యాపకులు

స్థానిక కేటియస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన ఎన్సిసి క్యాండిట్లు వి.శివప్రసాద్ మరియు జి.గోపాల్ తిరుపతిలో ఈ నెల 6వ తేదీ నుండి 13వ తేదీవరకు జరిగిన ట్రెక్సింగ్ క్యాంపులో పాల్గొన్నారు. ఇందులో భాగంగా జరిగిన కేరళ, మహారాష్ట్ర, తమిళనాడు, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణా ఐదు జట్ల వాలీబాల్ పోటీలోన్ల 6క్సిత్ ఆంధ్ర బెటాలియన్ కర్నూల్ గ్రూప్ నందు ప్రాతినిధ్యం వహించిన పి.శివప్రసాద్ గోల్డ్ మెడల్ సాధించాడు. క్యాంపు ముగించుకొని వచ్చిన ఎన్సిసి క్యాడేట్లని కళాశాల ప్రిన్సిపల్ డా.ఆర్. రఘురామ మూర్తి, వైస్ ప్రిన్సిపల్ డా.శ్రీనివాసులు, ఎన్సీసి సిటిఓ జక్కల కిరణ్ మరియు ఇతర అధ్యాపకులు అబినందించారు. క్యాంపు నందు వాలీబాల్ పోటీలో గోల్డ్ మెడల్ సాధించడం కళాశాలకు గర్వకారణమని శివప్రసాద్‌ని అబినందించారు.

## పప్పుశెనగ పంపిణీ ప్రారంభం...


పప్పుశెనగ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కాలవ

**డి.హీరేహాళ్, అక్టోబర్ 14 ప్రభాతవార్త:**

డి.హీరేహాళ్ మండలంలోని నాగలాపురం గ్రామంలో శాసనసభ్యులు కాలవ శ్రీనివాసులు పప్పుశెనగ విత్తన పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రాయదుర్గం తాలుకాలోని కణేకల్లు మండలానికి 4500క్వింటాళ్ళ, బొమ్మనహాళ్‌కు 500క్వింటాళ్లు, డి.హీరేహాళ్‌కు 400క్వింటాళ్ల కేటాయించడం జరిగింది. క్వింటాలు ధర సబ్సిడీ పోగా రూ.7050 క్వింటాల్ ధర అని తెలియజేశారు. అనంతరం ఏడిఏ మాట్లాడుతూ 16వ తేదీ వరకు అధిక వర్షాలు కురిసే అవకాశం ఉందని, కాబట్టి రైతులు 16వ తేదీ తర్వాత పప్పు శెనగను విత్తుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో బొమ్మనహాళ్ మండల వ్యవసాయ అధికారి సాయికుమార్, బొమ్మనహాళ్ ఏఈఓ గోపాల్, ఆర్‌ఎస్‌కె సిబ్బంది మరియు రైతులు పాల్గొన్నారు.

## తిమ్మగానిపల్లిలో రూ.15 లక్షలతో సిసి రోడ్డుకు భూమిపూజ

**లేపాక్షి, అక్టోబర్ 14 ప్రభాతవార్త**


భూమిపూజ చేస్తున్న దృశ్యం

మండలంలోని తిమ్మగానివల్లి గ్రామంలో పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా 15 లక్షల రూపాయలతో సిసిరోడ్డు నిర్మాణానికి సోమవారం ఏపిడి శివానందనాయక్, సర్పంచు సిద్ధార్థ్ భూమిపూజ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా పల్లె పండుగ కార్యక్రమాన్ని తెలుగుదేశం పార్టీ నాయకులు సోమవారం ప్రారంభించారు. ఇందులో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లో సిసి రోడ్లు, రహదారుల నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా తిమ్మగానిపల్లిలో 15 లక్షలతో సిసి రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమ్ములంలో ఎంపిడిఓ నరసింహమూర్తి, ఏపిఓ మధుసూదన్‌రెడ్డి, నాయకులు శివన్న, మారుతిప్రసాద్, నంజుండప్ప, సిద్ధలింగప్ప, అశ్వత్థప్ప, తెలుగుదేశంపార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## పేద కుటుంబాలకు ఆర్థిక సాయం అందచేసిన రామానందన్

**లేపాక్షి, అక్టోబర్ 14 ప్రభాతవార్త**


ఆర్థిక సాయం అందచేస్తున్న రామానందన్

మండలంలోని చోళసముద్రం గ్రామంలో ఆదివారం రాత్రి ఎరుకుల బాబు ఆకస్మికంగా గుండెపోటుతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న లేపాక్షి ఆలయ కమిటీ చైర్మన్ కరణం రామానందన్ చోళసముద్రంకు వెళ్లి అతని భార్యాపిల్లలను పరామర్శించి 10 వేల రూపాయల ఆర్థికసాయం అందచేశారు. అదేవిధంగా ఇదే గ్రామంలోని ఎస్‌సి కాలనీకి చెందిన హరిజన రామాంజినప్ప అనే వ్యక్తి గత కొన్ని రోజుల క్రితం మృతి చెందిన విషయం తెలుసుకుని అతని భార్యకు 5 వేల రూపాయల ఆర్థిక సాయం అందచేశారు. సొంత గ్రామంలో పేదలకు అండగా భరోసాగా వుండడంతో గ్రామపెద్దలు, ప్రజలు రామానందన్‌కు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు జయప్ప, దుర్గానాని, మిత్రులు చెన్నకృష్ణ, గంగరాజు, బాధిత కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే మరియు క్రిష్టియన్ మైనార్టీ అధ్యక్షులను మర్యాదపూర్వకముగా కలిసిన పాస్టర్లు

**గుమ్మఘట్ట, అక్టోబర్ 14 ప్రభాతవార్త:**


అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటిని కలిసిన పాస్టర్లు


టిడిపి క్రిష్టియన్ మైనార్టీ రాష్ట్ర అధ్యక్షులను సన్మానిస్తున్న పాస్టర్లు

అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ టిడిపి క్రిష్టియన్ సెల్ రాష్ట్ర అధ్యక్షులు ఈటి స్వామి దాస్, అనంతపురం పాస్టర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు రెడ్డివారి నెహెమ్యా నాగరాజును గౌరవ సలహాదారులు ఆనంద్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా గుమ్మఘట్ట మండల పాస్టర్లు జాన్‌పాల్ సురేష్ మోషే, బ్రహ్మసముద్రం మండల జయపాల్ డేవిడ్ పాల్ అబ్రహాం తదితరులు కిసి సోమవారం 52వ సర్వసభ్య సమావేశంలో జిల్లా అధ్యక్షులు రెడ్డివారి నెహెమ్యానాగరాజు ఆధ్వర్యంలో ఘనంగాసన్మానించారు. ఎమ్మెల్యే దగ్గుపాటివెంకటేశ్వర ప్రసాద్ క్రిష్టియన్ మైనార్టీ సంక్షేమానికి కృషి చేస్తామని టిడిపి క్రిష్టియన్ సెల్ రాష్ట్ర అధ్యక్షులు ఈటి స్వామి దాస్ తెలిపారు.

## కుందుర్పి మండలంలో పల్లె పండుగ పంచాయితీ వారోత్సవాలు

**కుందుర్పి, అక్టోబర్ 14 ప్రభాతవార్త**


పల్లె పండుగ పంచాయితీ వారోత్సవాలు నిర్వహిస్తున్న దృశ్యం

అక్టోబర్ 14 నుంచి 20వ తేది వరకు పల్లె పండుగ పంచాయితీ వారోత్సవాలు సోమవారం కుందుర్పి మండల అపిలేపల్లి గ్రామంలో కళ్యాణదుర్గం శాసనసభ్యులు అమిలినేని సురేంద్రబాబుకి సూచన ప్రకారం సర్పంచు హసీనాబి అతావుల్లా గ్రామ కన్వీనర్ రామాంజినేయులు, కుందుర్పి మండలం మాజీ కన్వీనర్ కర్తనపర్తి రామాంజినేయులు, విరూపాక్షి గౌడ్, మాజీ సర్పంచు ఓబులేసు, ఎంజిబిఓ బాలాజీ ఈసిఓ శర్మాస్‌వలి, టెక్నికల్ అసిస్టెంట్ బెస్తరపల్లి మాజీ సర్పంచు రాఘవేంద్ర బాబు, తామీర్, మండలపల్లి బొజ్జప్ప, కమిటీ చైర్మన్ బి.చిరంజీవి, మల్లికార్జునప్ప, నాగరాజ్, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అక్టోబర్ నెలలో బియ్యం లేనట్లా..?

**బెలుగుప్ప, అక్టోబర్ 14 ప్రభాతవార్త**

మండల పరిధిలో ఒనంపల్లి, గుండ్లపల్లి, బెలుగుప్పలో రెండు, నాలుగు స్టోర్లకు సంబంధించిన అక్టోబర్ నెల బియ్యం ఇంత వరకు రేషన్‌కార్డు దారులకు ఇవ్వలేదు. దీనికి గల కారణం ప్రభుత్వ అధికారులు రేపోమాపో వస్తాయని ప్రజలకు చెబుతున్నారే తప్పా అర్ధం నెల అయినా కూడా ఇంత వరకు రేషన్ కార్డు దారులకు బియ్యం అందివ్వలేదు. రేషన్‌కార్డు దారులు స్టోర్లకు వెళ్లి, తిరిగి వస్తున్నారే తప్పా బియ్యం మాత్రం ఇవ్వడం లేదని వాపోతున్నారు. వెంటనే ప్రభుత్వ అధికారులు చొరవ తీసుకుని రేషన్‌కార్డు దారులకు బియ్యం పంపిణీ చేయాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

## పల్లె పండుగ కార్యక్రమం

**బెలుగుప్ప, అక్టోబర్ 14 ప్రభాతవార్త**



భూమి పూజ చేస్తున్న అధికారులు

మండల పరిధిలో అంకంపల్లి, రామ సాగ్రం గ్రామాల్లో పల్లె పండుగ కార్య క్రమాన్ని మండల పరిషత్ అధికారి లక్ష్మినారాయణ ఆధ్వ ర్యంలో నిర్వహిం చారు. ఈ పల్లె పండుగ కార్యక్రమంలో ప్రభుత్వ అధికారులు పాల్గొని రామసాగ్రం గ్రామం లో 13లక్షలసిసిరోడ్లను నిర్మించడానికి భూమిపూజ నిర్వహించారు. సోక్‌పిట్ కు కూడా 47వేల రూపాయలు మంజూరయ్యాయని, అందులో భాగంగా అంకంపల్లి గ్రామంలో సోక్‌పిట్‌కు 47వేలు, హార్‌సిటింగ్‌పిట్‌కు 74వేలు మంజూరు అయ్యాయని ఆగ్రామపెద్దలకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రామసాగ్రం సర్పంచు రామకృష్ణమ్మ, అంకంపల్లి సర్పంచు రుద్రానంద, ఫీల్డ్ అసిస్టెంట్ సూర్యప్రకాస్, ప్రభుత్వ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పదవీ బాధ్యతలు చేపట్టిన సిఎస్‌డిటి

**బెలుగుప్ప, అక్టోబర్ 14 ప్రభాతవార్త**


పిఎం బాషా

బెలుగుప్ప మండల కేంద్రంలో తహశీల్దారు కార్యాలయంలో సివిల్ సప్లై డిప్యూటీ తహశీల్దారుగా పీఎం బాషా పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ అధికారి అనంతపురం రూరల్‌లో పని చేస్తూ.. సోమవారం పదవీ బాధ్యతలు తీసుకుని మండలంలో ఎలాంటి స్టోర్లకు సంబంధించి నిత్యావసర సరుకులు 1నే పంపిణీ చేస్తామని తెలిపారు.

## బదిలీపై వెళుతున్న అధికారులకు ఘన సన్మానం

**పుట్టపర్తి రూరల్ అక్టోబర్ 14 ప్రభాతవార్త**


సన్మానించిన ఉద్యోగులతో నాయకులు.

మండల అబివృద్ధి కార్యాలయంలో పలువురు అధికారులు బదిలీపై వెళుతున్న తరుణంలో వారిని ఘనంగా సన్మానించారు. పుట్టపర్తి మండలం ఎంవిడిఓ కార్యాల యం నుండి పనిచేస్తూ బదిలీ పై వెళ్తున్న ఈఓఆర్డీ అశోక్‌కుమార్ రెడ్డి,జూనియర్ అసిస్టెంట్ సుబ్రమణ్యం.పంచాయితీ కార్యదర్శులు జయపాల్‌రెడ్డి, తేజ, పుష్ప,శివ శంకర్‌నాయక్,మహమ్మద్ హాజిత్ లను వారు ఘనంగా సన్మానిం చారు. ఈ కార్యక్రమంలో పుట్టపర్తి మండలంలో వారు చేసిన సేవల గురించి వివరించారు.పనులను ప్రశంసించారు.ఈ సందర్భంగా ఎంపిపి ఏవి రమణారెడ్డి మాట్లాడుతూ ప్రతి అధికారికి బదిలీలు,పదవీ విరణలు సహజమని,ఎక్కడికి వెళ్లినా వారి వృత్తిలో మంచి పేరు తేవాలని కోరారు.ఈ కార్యక్రమంలో పుట్టపర్తి మండల అధ్యక్షుడు ఏవి రమణారెడ్డి,మాజి ఎంపిపి శ్రీరామ రెడ్డి,ఇన్చార్చి ఎంపిడివో ఇందిరా బాల,కార్యలయ సిబ్బంది, పంచాయితీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## భవన నిర్మాణ కార్మికులకు ఉచితంగా ఇసుకను పంపిణీ చేయాలి


వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

**పుట్టపర్తి రూరల్ అక్టోబర్ 14 ప్రభాతవార్త**

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డుకు ఉచితంగా ఇసుక పంపిణీ అమలు చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం నియోజకవర్గ కమిటీ ఆధ్వర్యంలో మాజి మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి,ఎమ్మెల్యే పల్లె సంధూర కి భవన నిర్మాణ కార్మికుల సంఘం జిల్లా కోశాధికారి ముత్యాలు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా ముత్యాలు మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా సుమారు భవన నిర్మాణ కార్మికులు ఉన్నారని గత ప్రభుత్వహయాంలో ఇసుక క్వారీ పనులు ఆపివేసి నిర్మాణ కార్మికులకు పనులు లేకుండా చేశారిని భవన నిర్మాణ కార్మికుల కోసం ఏర్పాటుచేసిన సంక్షేమ బోర్డు ద్వారా గత ఐదు సంవత్సరాలుగా అమలవుతున్న సంక్షేమ పథకాలను ఆపివేస్తూ గత వైసిపి ప్రభుత్వం 1214 మోమో జారీ చేసిందని దాని ఫిలితంగా లక్షలాది మంది భవన నిర్మాణ కార్మికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారని ఎన్నికలకు ముందు తెలుగుదేశం పార్టీ తన ఎన్నికల మేనిఫేస్టోలో భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరిస్తామని బోర్డు ద్వారా సంక్షేమ పథకాలు అమలు చేస్తామని హామీ ఇచ్చారన్నారు.ప్రభుత్వం ఇచ్చిన హామీవల్ల భవన నిర్మాణ కార్మికులు విశ్వసించి ఓట్లు వేసి కూటమి ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకొచ్చారని,ఈ విషయాన్ని మంత్రులుగా ఉన్న వారే బహింగంగా ప్రకటించిన సందర్భాలు ఉన్నాయని. నిర్మాణదారులకు ఉచిత ఇసుక అమలు చేస్తానన్న ప్రభుత్వం ఉచితంగా ఇచ్చిన రవాణాచార్జిలపేరుతో గతంలోఉన్న రేట్లకన్నా అధికంగా వసూలు చేస్తున్నారని ఫలితంగా నేటికి నిర్మాణ కార్మికులకు పనులు లేక అర్ధాకులతో ఉన్నారని ప్రస్తుత ఇసుక పాలసీమ సమీక్ష చేసి ధరలు అందుబాటులో ఉండేలాగా చూడాలని అవసరమైన వినియోగదారులకు ఇసుక వెంటనే ఉచితంగా సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.ఈ సందర్భంగా స్పందించిన ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి, నిర్మాణ రంగ కార్మికులకు గుర్తింపు కార్డుల విషయమై కార్మికశాఖ అధికారులతో మాట్లాడి పరిష్కరం చేస్తానని హామీ ఇవ్వడం జరిగింది.ఈ కార్యక్రమంలో భవననిర్మాణకార్మికులకు జిల్లాకోశాధికారి ముత్యాలు పుట్టపర్తి మూడుపుఆంఆల బాధ్యులు బ్యాల్లా అంజి వీరికి మద్దతుగా ఎస్‌ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు పవన్ కుమార్ కొత్తచెరువు మండల సిఐటియు అధ్యక్షులు శంకర్‌రెడ్డి ఐద్వా మహిళా నాయకురాలు శ్రామణి,నాగవేణీ ఈ కార్యక్రమంలో పాల్గోన్నారు.

## పారిశుద్ధ్య కార్మికులకు భరోసా కల్పించండి....సిపిఐ

**రాయదుర్గం, అక్టోబర్ 14 ప్రభాతవార్త:**


విలేఖర్ల సమావేశంలో మాట్లాడుతున్న సిపిఐ తాలుకా కార్యదర్శి ఎం.నాగార్జున

పారిశుద్ధ్య కార్మికులు ఈ సమాజానికి ఎంతో అవసరమని, అటువంటి పారిశుద్ధ్య కార్మికుల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్న ప్రభుత్వాల తీరు చాలా బాధాకరమని, పారిశుద్ధ్య కార్మికులకు భరోసా కల్పించాలని సిపిఐ తాలుకా కార్యదర్శి ఎం.నాగార్జున డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని సిపిఐ కార్యాలయంలో నాయకులతో కలిసి విలేఖర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేకువజామునే నాలుగు గంటలకు లేచి వాళ్ల యొక్క పనుల్లో నిమగ్నమై పోతారన్నారు. అటువంటి కార్మికులకు సహాయ సహకారాలు అందించడంలో ప్రభుత్వాలు పూర్తి నిర్లక్ష్యం వహిస్తున్నాయని, ప్రభుత్వాల పనితీరు పారిశుద్ధ్య కార్మికులపై చిన్నచూపు చూస్తోందన్నారు. దేశవ్యాప్తంగా 2019 నుండి 2023మధ్య కాలంలో ప్రమాదకర పరిస్థితుల్లో మరుగ కాలువలను, సెప్టిక్ ట్యాంకులను శుభ్రంచేస్తూ 377మంది మృతువాతపడినట్లు ప్రభుత్వమే ప్రకటించిందన్నారు. అర్భాటాలకే తప్ప స్వచ్ఛభారత్ ఆచరణలో మాత్రం శూన్యమని, స్వచ్ఛభారత్ పేరుతో ప్రచారం కోసం సఫాయి కార్మికులను కడిగి నీళ్లను తలమీద చెల్లుకుంటే సరిపోదని, వారి ఆర్థిక సామాజిక పరిస్థితులు మెరుగు పడాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. వారికి వేతనాలు పెంచి గౌరవం భరోసా, భద్రతకల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. ఎన్ని ప్రభుత్వాలు మారినా కార్మికులకు మాత్రం న్యాయం జరగం లేదని, 2014 అక్టోబర్ 2న స్వచ్ఛభారత్ ప్రారంభిస్తామని అప్పటి ప్రధాని, ఇప్పటి ప్రధాని పారిశుద్ధ్య పనులు మరుగుదొడ్ల నిర్మాణం వాడకంలో కొంత మేరకు విజయం సాధించినా ఇంకా సాధించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వం దీనిపై దృష్టి సారించి స్వచ్ఛభారత్ ఆశయాలను నూరు శాతం అమలు చేయాలని ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు. పారిశుద్ధ్య కార్మికులను అన్ని రకాలుగా ప్రభుత్వం చేయూతనిచ్చి ఆదుకోవాలని, కాంట్రాక్టు కార్మికులను పద్ధతిలో కొనసాగించాలని, కరోనా సమయంలో రాష్ట్ర వ్యాప్తంగా పారిశుద్ధ్య పనులను నిర్వర్తించిన వారిని పనుల్లోకి తీసుకోవాలని, సకాలంలో వారికి వేతనాలు అందజేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శి కొట్రేష్, మండల కార్యదర్శి దుర్గన్న, సిపిఐ తాలుకా కార్యవర్గ సభ్యులు తిప్పేస్వామి, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

## గుత్తిలో ఘనంగా వసంతోత్సవం

**గుత్తి, అక్టోబర్ 14 ప్రభాతవార్త**


వసంతోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

గుత్తి పట్టణంలోని ఆర్యవైశ్య సంఘం, యువజన సంఘం ఆధ్వర్యంలో సోమవారం వసంతోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గుత్తి అమ్మవారిశాల నుండి కోటలోని శ్రీయల్లమ్మ దేవాలయం, కోట ముఖద్వారం బసవేశ్వర కూడలి మీదుగా మెయిన్‌బజార్‌లోని వినాయక సర్కిల్ మీదుగా శ్రీసంతానగోపాలస్వామి దేవాలయం వరకు శ్రీవాసవి కన్యకాపమేశ్వరి అమ్మవారిని ఊరేగిస్తూ రంగులు చల్లుకుంటూ నృత్యం చేస్తూ ఆనందంతో చిందులు వేశారు. చిన్నా పెద్ద తేడా లేకుండా అందరూ ఆనందంగా కేరింతలు కొడుతూ కార్యక్రమంలో పాల్గొన్నారు. దసరా వేడుకల్లో చివరి రోజు విజయానికి చిహ్నంగా ఆనందడోలికల్లో విహరించారు. అనంతరం అమ్మవారిశాలలో భోజనాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం సభ్యులు, పెద్దలు, ఆర్యవైశ్య యువజన సంఘం కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

## హెచ్‌ఎల్‌సి కాలువలో పడి యువకుడు మృతి

**డి.హీరేహాళ్, అక్టోబర్ 14 ప్రభాతవార్త:**


రుద్రప్ప (ఫైల్‌ఫోటో)

డి.హీరేహాళ్ మండల పరిధిలోని మురడి గ్రామానికి చెందిన రుద్రప్ప(15)హెచ్‌ఎల్‌సి కాలువలో పడి మృతి చెందిన సంఘటన గ్రామంలో చోటు చేసుకుంది. డి.హీరేహాళ్ ఎస్సై గురుప్రసాద్‌రెడ్డి, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు మురడి గ్రామానికి చెందిన రుద్రప్ప దసరా పండుగకి బట్టలు కొనిపించాలని తండ్రిని అడగడంతో ఇప్పుడు తమ వద్ద డబ్బులు లేవని చెప్పగా ఈ నెల 11వ తేదీన మనస్థాపం చెంది ఇంటి నుండి వెళ్లిపోయి, నేను బతకను చచ్చిపోతాను అంటూ తల్లిదండ్రులకు వీడియో కల్‌చేసి మండలంలోని గొడిశెలపల్లి గ్రామం వద్ద ఉన్న హెచ్‌ఎల్‌సి కాలువలో దూకడం జరిగిందన్నారు. చుట్టుపక్కల వారు గమనించి కాపాడ్డానికి ప్రయత్నించినా ఫలితం లేకపోవడంతో సోమవారం కాలువలో వెతకగా కణేకల్లు మండలంలోని ఎర్రగుంట గ్రామం వద్ద మృతదేహాన్ని కనుగొన్నట్లు తెలిపారు. ఈ సంఘటనపై తండ్రి నాగేంద్ర ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసినట్లు తెలిపారు.

## కళ్యాణదుర్గంలో లిక్కర్‌షాపులు దక్కించుకున్న వారు వీరే

### -కార్యకర్తల కోసం 75 ధరఖాస్తులు వేసిన టిడిపి

**కళ్యాణదుర్గం, అక్టోబర్ 14 ప్రభాతవార్త**

కళ్యాణదుర్గం నియోజకవర్గంలోని 5మండలాలతో పాటు బెలుగుప్పతో కలసి 11 మద్యం దుకాణాల కోసం దాఖలైన ధరఖాస్తుల్లో లాటరీలో మద్యం దుకాణాలు దక్కించుకున్న వారు అదృష్టవంతులు.కళ్యాణదుర్గం మున్సిపాలిటీలోమూడు, కళ్యాణదుర్గం రూరల్‌లో రెండు, బ్రహ్మసముద్రం, బెళుగుప్ప, కంబదూరు,శెట్టూరు మండలాల్లో ఒక్కొక్కటి చొప్పున, కుందుర్పిలో రెండు షాపులకు లాటరీ తీసారు. ఈ లాటరీలో కళ్యాణదుర్గం మున్సిపాలిటీలో కొలకనూరు రమేష్‌బాబు,ఎన్.దినేష్‌కుమార్ నాయుడు,కేతిరెడ్డి నీలకంతలు దక్కించుకోగా, కళ్యాణదుర్గం రూరల్‌లో చల్లా నరసింహులు,సన్నపురెడ్డి సుజలలు దక్కించుకున్నారు. కాగా బ్రహ్మసముద్రం మండలంలో రమేష్ బాబు,బెళుగుప్పలో వేలూరు హనుమంతరెడ్డి, కంబదూరులో ఊరువాకిలి లక్ష్మణమూర్తి,శెట్టూరులో గుజ్జల నగేష్, కుందుర్పిలో తలారి నాగరాజు, బోయప్రతాప్‌లు మద్యం దుకాణాలు దక్కించుకున్నట్లు తెలుస్తోంది.ఇదిలా ఉండగా కళ్యాణదుర్గం ప్రాంతంలోని మద్యం దుకాణాలను పార్టీకి కష్టపడిన కార్యకర్తలకు ఉపాధి కల్పించాలని స్థానిక ఎమ్మెల్యే వర్గీయులు 11 మద్యం దుకాణాల కోసం సొంతనిధులు వెచ్చించి 75 ధరఖాస్తులు వేయగా కేవలం రెండు మాత్రమే లాటరీలో అవకాశం వచ్చినట్లు తెలుస్తోంది. మిగిలిన 9 దుకాణాలకు ఇతరులు దక్కించుకోవడం గమనార్హం.కార్యకర్తలకు ఉపాది కల్పించాలని వ్యూహరచన చేసిన ఎమ్మెల్యే వర్గీయులు తమ కార్యకర్తలకు న్యాయం చేసేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటారోనన్న కోణంగా పార్టీ కార్యకర్తలు ఉత్కంఠగా ఎదురుచూస్తున్నట్లు తెలుస్తోంది.

## శ్రీసత్యసాయి జిల్లాలో చిలమత్తూరు వ్యక్తి కిడ్నాప్ కలకలం

**చిలమత్తూరు. అక్టోబర్ 14 ప్రభాతవార్త**

శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తి సాయిఆరామంలో మద్యం షాపుల లాటరీలో చిలమత్తూరు మండలానికి చెందిన వ్యక్తి కిడ్నాప్ కలకలం రేపింది. లేపాక్షి మండల 57వ నెంబర్ షాపు చిలమత్తూరు యగ్నిశెట్టిపల్లి గ్రామానికి చెందిన రంగనాథ్‌కు దక్కింది. ఇది జీర్ణించుకోలేక ఓ రాజకీయ పార్టీకి చెందిన లేపాక్షి వాసి తన అనుచరులతో కలిసి కిడ్నాప్ చేసినట్లు రంగనాథ్ భార్య అశ్విని పుట్టపర్తి అర్బన్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది, పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. సాయంత్రం హిందూపురం సిఐ రాజగోపాల్‌నాయుడు ఎదుట రంగనాథ్ హాజరై తనను ఎవరూ కిడ్నాప్ చేయలేదని చెప్పడంతో కిడ్నాప్ కథకు తెరపడింది.

03ATP14_03ATP14.qxd 14-10-2024 PM 11:10 Page 1



# సాగునీటి సాధనకు నేటి నుంచి 20వరకు సీపీఎం బస్సు యాత్ర

## - 21న కలెక్టర్ ఆఫీస్ వద్ద మహాధర్నా

అనంతపురం, అక్టోబర్ 14 ప్రభాతవార్త బ్యూరో

సాగునీటి సాధనకు ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఈ నెల 15 నుంచి 20వ తేది వరకు సిపిఎం పార్టీ బస్సు యాత్ర నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా ఈనెల 21వ తేదిన జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. సాగునీటి వనరుల అభివృద్ధికి సరైన చర్యలు చేపట్టకుండా ఇల్లాకు అన్ని ప్రభుత్వాలు అన్యాయం చేశాయని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.రాంభూపాల్ తెలిపారు. సోమవారం స్థానిక గణేనాయక్ భవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఓ.నల్లప్ప, వి.సావిత్రి, ఎన్.నాగేంద్ర, ఎం.బాలరంగయ్యలతో కలిసి మాట్లాడారు. పైన తుంగభద్ర, కింద శ్రీశైలం డ్యాంలు నిండి పొంగి పొర్లుతున్నా మన జిల్లాకు రావాల్సిన నీరు రాకపోవడం దారుణమన్నారు. ఈ పరిస్థితిపై ప్రజాభిప్రాయాన్ని పాలకుల దృష్టికి తెచ్చేందుకు బస్సు యాత్ర చేపట్టినట్లు తెలిపారు. వ్యవసాయం బతకాలంటే కనీసం 30 శాతం భూమికి సాగు నీరు వసతులు కల్పించాలని జాతీయ ఇరిగేషన్ కమిషన్ 1972లో సూచించింది.

2004లో ఏర్పాటైన జయతి ఘోష్ కమిషన్, 2009లో స్వామినాథన్ ఫౌండేషన్ వారి నివేదిక, 2012లో ఐసిఎఆర్ న్యూ ఢిల్లీ కమిటీ వారు ఇచ్చిన నివేదికతో సహా, అందరూ అనంతపురం జిల్లాలో కరు వులను పారదోలాలంటే, నదీ జలాలను మళ్లించాలని, అందుబాటులో ఉన్న నీటి వనరులను పూర్తిగా వినియోగించుకోవాలని సిఫార్సు చేశాయి. పాల కులు మారడమే తప్ప రైతులు, కూలీల బ్రతుకులు మారడం లేదన్నారు. జిల్లాలో నికరంగా 14 లక్షల 85 వేల ఎకరాల సాగు భూమి ఉంది. ఇందు లో స్థిరీకరించబడిన ఆయకట్టు 45,224 వేల ఎకరాలు, అంటే మొత్తం సాగు భూమిలో కేవలం 3.04 శాతం భూమికి మాత్రమే నీటి పారుదల సౌకర్యం ఉంది. ఈ మాత్రం ఆయకట్టులో పావువంతు భూమికి కూడా సాగు నీరు అందడం లేదన్నారు. ఉదాహరణకు 2021-22లో 4,821 ఎకరాలు, 2022-23లో ఏడు వేల ఎకరాల ఆయకట్టు మాత్రమే సాగైందన్నారు. 14 సంవత్స రాల క్రితం ప్రారంభమైన హెచ్ఎల్‌సి ఆధునీకరణ అంతులేని నిర్లక్ష్యానికి గురైందన్నారు. 2012 నుంచి హంద్రీనీవా నీరు జిల్లాకు వస్తున్నా ఇప్పటి వరకు పంట కాలువలు లేవు. దశా బ్దాలు గడిచినా ఉంతకల్లు జలా శయ నిర్మాణం చేపట్టలేదు. బిటి .ప్రా జెక్టుకు జీడిపల్లి నుంచి మొదలు పెట్టిన ఎత్తి పోతల పథకం మధ్య లోనేనిలిచి పోయింది. జిల్లాలో శ్రీ సత్యసాయి, శ్రీరా మిరెడ్డి తాగునీటి పథ కాల ద్వారా వందలాది గ్రామాలకు గత 20సంవత్స రాలుగా తాగు నీరు అందుతున్నా ఇప్పటికీ సక్రమమైన నిర్వహణ వ్యవస్థ లేదు. అనంతపురం జిల్లా వారసత్వ సంపదగా కోట్ల రూపాయల విలువైన చెరువులు కుంటలు ఉన్నాయి. ఒక్క టీఎంసి నీటి నిలువ జలాశయాన్ని నిర్మించడానికి 300 కోట్ల రూపాయలు అవసరం అవు తాయి. ఇంత డబ్బు ఖర్చు చేయకుండానే వందల టీఎంసీల నీటిని నిలువ చేసుకోవడానికి మన జిల్లాలో ఎప్పటినుండో ఉన్న చెరువులు, కుంటలు అద్భుతమైన అవకాశాలు, నీటి పారుదల కాలువలతో గ్రావిటీ ద్వారా చెరువులను, కుంటలను అనుసంధానం చేయా లనే రైతుల కోర్కెలను పాలకులు అమలు చేయలేదు. సాగునీటి సమస్య పరిష్కారం కోసం ఈ నెల 15 న ఉంచి 20 వరకు బస్సు యాత్ర 21న కలెక్టర్ ఆఫీస్ వద్ద మహాధర్నా చేస్తున్నట్లు తెలిపారు.


పోస్టర్స్‌ను విడుదల చేస్తున్న సిపిఎం జిల్లా నేతలు

# అనంతపురంలో ఆటో డ్రైవర్ల ర్యాలీ, కలెక్టరేట్ వద్ద ధర్నా

అనంతపురం, అక్టోబర్ 14 ప్రభాతవార్త బ్యూరో

అనంతపురంలోని వివిధ ఆటో స్టాండ్ల నుంచి వచ్చిన ఆటో డ్రైవర్లు సోమ వారం తమ ఆటోలతో స్థానిక నగరంలోని ఎన్‌జిఓ హోమ్ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించి జిల్లా కలెక్టర్‌కు మెమోరాండం ఇచ్చి ఆటో స్టాండులోకి ర్యాపిడ్ బైకులు రాకుండా చర్యలు చేపట్టాలని కోరారు. ఈ యాప్‌లనే వాటికి మేము పర్మిషన్ ఇచ్చినవి క అవు, రాజకీయ విధానం ద్వారా వచ్చినవి కనుక శాసన సభ, పార్లమెంట్ సభ్యులు దీని గురించి ఆలోచించాలని కలెక్టర్ చెప్పారు. వ్యక్తిగత వాహనాలను వ్యాపారానికి వాడకుండా చర్యలు తీసుకోవాలని, ర్యాపిడో బైక్‌లను ఆటో స్టాండ్‌కి దగ్గరగా రాకుండా దూరంగా ఉంచాలని, ఘర్షణలను నివారించాలని జిల్లా ట్రాన్స్ ఫోర్టు అధికారికి కూడా వివరించారు. అనంతరం ఆటో కార్మికు లను ఉద్దేశించి జిల్లా నాయకులు ఎం.రాజు, వై.హాజీవలి, సి.సు ధాకర్, నాగభూషణంలు మా ట్లాడుతూ.. అనంతపురం జిల్లాలో ప్రధానంగా టవునులో ఆటోలు నడుపుతూ ఎన్నో ఏళ్లుగా ఇదే వృత్తిలో స్వతంత్ర్య ంగా జీవిస్తున్న మా ఆటో కార్మికులకు ఇప్పుడు రాపిడో బైకుల పేరుతో కొత్త కష్టాలు వచ్చాయన్నారు. అసలే కరువు జిల్లా, పెరిగిన పెట్రోల్ ధరలు, నెల నెలా కట్టుకొనే ఆటో ఫైనాన్స్ కిస్తీలతో భారంగా బ్రతు కులీడుస్తున్నామని, నెనె లా ఇంటి అద్దెలు కట్టుకోలేక, చిన్న అనారోగ్యాలు వచ్చినా నెల కిస్తీ కట్టలేక వడ్డీలకు తెచ్చి పెడుతూ పిల్లల చదువులు ఫీసులు కూడా కట్టుకోలేని ఇబ్బందుల్లో మేమున్నామని ఆటోడ్రై వర్లు ఎదుర్కొంటున్న సమస్యను పరిష్కరించకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమానికి ఆటో యూనియన్ నాయకులు ఎం.రాజు, వై.హాజీవలి, ఎఐఎఫ్ టియు (న్యూ) నాయకులు సి.సుధాకర్, ఎస్.నాగభూషణం నాయక త్వం వహించారు. రైతు కూలీ సంఘం, స్త్రీ విముక్తి సంఘటన, హమాలీ యూనియన్ అనంతపురం జిల్లా నాయకులు మద్దతుగా ఈ ర్యాలీలో పాల్గొన్నారు.


ర్యాలీ నిర్వహిస్తున్న ఆటో కార్మికులు


జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఆటో కార్మికులు

# మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులకు బకాయి ఉన్న ఇపిఎఫ్ వెంటనే చెల్లించాలి

## - ఇంజినీరింగ్ కార్మికులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపచేయాలి

అనంతపురం, అక్టోబర్ 14 ప్రభాతవార్త బ్యూరో

మున్సిపల్ రంగంలో పని చేస్తున్న పారిశుద్ధ్య కార ఇమకులతోపాటు ఇంజినీరింగ్ కార్మికులకు కూడా సమాన హక్కులు కల్పించాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేష్‌గౌడ్ డిమాండ్ చేశారు. ఇంజినీరింగ్‌కార్మికుల సమస్యలు పరిష్కరిం చాలని సోమవారం అనంతపురం నగర పాలక సంస్థ నిర్వహించిన గ్రీవెన్స్ లో అధికారులకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా రాజేష్‌గౌడ్ మా ట్లాడుతూ.. మున్సిపల్ రంగంలో ఇంజినీరింగ్ కార్మికులు పదుల సంవ త్సరాల నుంచి పని చేస్తున్నా పోయిన ప్రభుత్వం ఇంజినీరింగ్ కార్మికుల హక్కులను కాలరాసిందన్నారు. 2019 వరకూ మున్సిపల్ కార్మికులకు వేత నాలు సమానంగా ఇచ్చినా వైసిపి ప్రభుత్వం విభజించు పాలించు అనే దోరనిలో పారిశుద్ధ్య కార్మికులకు 21వేల వేతనం ఇంజినీరింగ్ కార్మికులకు 15వేల వేతనం ఇస్తూ అవుట్‌సోర్సింగ్ కార్మికులకు ప్రభుత్వ ఉద్యోగులుగా పేర్కొంటూ సంక్షేమం పూర్తిగా నిలిపివేసి అన్యా యం చేసిందన్నారు. ఇంజి నీరింగ్ కార్మికులకు వితంతు, వికలాంగుల పింఛన్లు కూడా నిలిపివేశారన్నారు. నగర పాలక సంస్థలో పని చేస్తున్న 309 మంది ఇంజినీరింగ్ కార్మికులకు 2011లో సంబంధించిన 9 నెల ల పిఎఫ్ సొమ్ము 48 లక్షలు ఇపిఎఫ్ కార్యాలయానికి జమా చేసినా మున్సిపల్ అధికారులు కార్మికుల వివరాలు ఇవ్వడంలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారన్నారు. కార్మికుల ఖాతాలకు జమచేయిం చకపోవడం సరైందికాదన్నారు. ఈ సమస్యలపై ఎపి మున్సిపల్ వర్కర్స్ యూనియన్‌గా దశలవారీ ఆందోళనలకు పిలుపనిస్తా మన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి నగర ప్రధాన కార్యదర్శి కృష్ణుడు, ఎపి మున్సిపల్ వర్కర్స్‌యూనియన్ జిల్లా అధ్యక్షులు చిరంజీవి,జిల్లా సహాయ కార్యదర్శి నాగరాజు, సమితి సభ్యులు ప్రసాద్, నాయుడు, బాబు తదితరులు పాల్గొన్నారు.


వినతిపత్రం అందజేస్తున్న ఎపి మున్సిపల్ వర్కర్స్ యూనియన్‌నేతలు

# గ్రామాలను అభివృద్ధి పథంలో నిలపడమే ప్రభుత్వ లక్ష్యం

## -పల్లె పండుగ పంచాయితీ వారోత్సవాల్లో ఎంపిడిఓ తేజోష్ణ

పామిడి, అక్టోబర్ 14 ప్రభాతవార్త

.గ్రామ పంచాయితీలు అభివృద్ధి పథంలో నిలపడమే ప్రభుత్వ లక్ష్యం అని ఎంపిడిఓ తేజోష్ణ పేర్కొన్నారు. గ్రామీణాభివృద్ధికి పాటుప డాలన్న ఉద్దేశ్యంతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న పల్లె పండుగ పంచాయతీ వారోత్స వాల్లో భాగంగా సోమవారం మండల పరిధిలోని అనుంపల్లి, దిబ్బసానిప ల్లి, పాళ్యం, నీలూరు, రామగిరి రామరాజుపల్లి గ్రామపంచాయితీల్లో గ్రామ సభలను నిర్వహించిన అధికారులు ప్రజల సమస్యలను తెలుసుకుంటూనే పలు అభివృద్ధి పనులకు భూమి పూజ చేపట్టారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ తేజోష్ణ మాట్లాడుతూ.. ప్రతి గ్రామంలో సిసిరోడ్లు, వ్యవసాయ కుంటలు, పశువుల శాలలు, ఇంకుడు గుంతలు ఇతరాత్ర అభివృద్ధి పనులను సత్వరమే మొదలు పెట్టాలని నిర్ణయించిన ప్రభుత్వం పల్లె పండుగ పంచా యితీ వారో త్సవాల ను నిర్వహిస్తుండటం శుభ పరిణామం అన్నారు. టిడిపి సమ న్వయకర్త ఆర్ఆర్ రమేష్ మాట్లాడుతూ.. మునుపెన్నడూ జరగని విధంగా గ్రామ పంచాయితీల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు శ్రీకారం చుట్టడం గర్వించ దగ్గ విషయం అని తెలిపారు. రూరల్ కన్వీనర్ ముసలిరెడ్డి మాట్లాడుతూ.. రాజకీయాల్లో అపార అనుభవం కలిగిన చంద్రబాబు నాయుడు రాజకీయ ఉద్దం డుడిగా పేరుపొందారని ఆయన పాలనలో రాష్ట్రం అన్ని విధాలా అభజవృద్ధి చెందు తుందని ప్రజలంతా సుభిక్షంగా ఉంటారన్నారు. అనం తరం ఆయా గ్రామ పంచాయితీల్లో సిసిరోడ్ల నిర్మాణాలకు భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ రాజ్ డీఈ మురళీధర్, ఏఈ హేమ్లానాయక్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ తిరుపాల్ నాయక్, రాజేష్ నాయక్, తిరుపాలు, గోపాల్‌రెడ్డి, సుధాకర్, దేవేంద్రరెడ్డి, ఓబులేసు, నారాయణ, రాఘవ, హరీష్, ఓంకార్‌రెడ్డి, డేవిడ్, వెంకటేష్, రంజిత్, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఇడిపి రూరల్ కన్వీనర్ ముసలిరెడ్డి


సిసిరోడ్ల నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎంపిడిఓ తేజోష్ణ

# పామిడిలో ఆధార్ సెంటర్లను ఏర్పాటు చేయండి

## - తహశీల్దార్ శ్రీధరమూర్తిని కోరినర జనసేన, బిజెపి శ్రేణులు

పామిడి, అక్టోబర్ 14 ప్రభాతవార్త

పామిడిలో ఆధార్ సెంటర్‌ను ఏర్పాటుచేయాలని జనసేన, బిజెపి శ్రేణులు సోమవారం తహశీల్దారు శ్రీధర్‌మూర్తికి విన్నవించారు. ఆధార్‌కార్డు అన్నింటికీ కీలకం అని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటిస్తున్న క్రమంలో పట్టణంలో ఆధార్‌సెంటర్ లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. ఆధార్ కార్డు అప్‌డేట్, మార్పులు చేర్పులు, మొబైల్ నెంబర్ లిం క్, చిరునామ మార్చుకోవట, కొత్త ఆధార్‌కార్డు దరఖాస్తు చేసుకోవటానికి ఇతరప్రాంతాల్లోని సచివాయాలు, ఆధార్ సెంటర్లను ఆశ్రయించాల్సిన దుస్థితి నెలకొందన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులకు గుర్తించి పామిడిలో రెండు ఆధార్ సెంటర్లను ఏర్పా టు చేయాలని విన్నవించారు. దీంతో స్పందించిన తహశీల్దార్ శ్రీధరమూర్తి సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి ఆధార్‌సెంటర్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జనసేన,బిజెపి శ్రేణులు నక్కల రామాంజినేయులు, నల్ల బోతుల వీరప్ర తాప్, సురేష్, రాజు, నరేష్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.


తహశీల్దారు శ్రీధరమర్తికి విన్నవిస్తున్న జనసేన, బిజెపి శ్రేణులు

# సిసి రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన

శింగనమల, అక్టోబర్ 14 ప్రభాతవార్త

పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా సోమవారం మండల కేంద్రంలోని పశు వైద్య శాల సమీపంలో 36 లక్షల నిధులతో సిసి రోడ్ల నిర్మాణానికి తహశీ ల్దారు సాకే బ్రహ్మయ్య, ఎంపిడిఓ నిర్మలాకుమారి, ఏపిఓ శ్రీదేవి శంకు స్థాపన నిర్వహించారు. అనంతరం ఎంపిడిఓ కార్యాలయం వద్ద 4.50లక్షలతో ఇంకుడు గుంతల నిర్మాణానికి వారు భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో పంచా యితీ కార్యదర్శి లీలారాణి, విఆర్ఓ తాతయ్య, వైస్ ఎంపిపి విజయ, ఇంజినీరింగ్ అసిస్టెంట్ జయశ్రీ, అనిల్, టిడిపి నాయకులు సి.వెంకటేష్, చిన్న నాగముని, మాసుల్ చంద్రమోహన్, బోయ సత్యనారాయణ, ఎం.ఆదినారా యణ, బాషా, బండి వెంకటనారాయణ, శంకర్‌నారాయణ, జడేజా, నరసింహా, సత్యనారా యణ, ఆదినారాయణ, బోయ వెంకటనారాయణ, టిక్‌టాక్ శంకర్, బెస్త పాపన్న, శివపురం ఎరిస్వామి, మహేష్ యాదవ్, ఆర్మీ జీలాన్, షేక్షావలి, ఉపాధిహామీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా టిడిపి నేతలు మాట్లాడుతూ.. గ్రామ పంచాయితీల అభివృద్దే ఎన్డీయే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు.


సిసి రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న దృశ్యం


ఇంకుడు గుంతలు నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న దృశ్యం

# క్రైస్తవులకు అండగా ఉంటా......జిల్లా పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ 52వ సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే దగ్గుపాటీ ప్రసాద్

అనంతపురం రూరల్,అక్టోబర్14ప్రభాతవార్త:

అనంత జిల్లాలోని క్రైస్తవులకు అండగా ఉండి వారికి అన్నీ విధాలుగా సహాయ సహకారాలు అందిస్తాన్నాని అనంత అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటీ ప్రసాద్ పేర్కొన్నారు.సోమవారం జీసస్ నగర్‌లోని ఫెయిత్ చర్చ్‌లో జిల్లా పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ 52వ సర్వసభ్య సమావేశంను జిల్లా అధ్యక్షులు రెడ్డివారి నెహెమ్యా నాగరాజు అధ్యక్షతన కమిటీ సభ్యులు నిర్వహించారు.ఈ సమావేశానికి ముఖ్య అతిధిగా అనంత అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటీ ప్రసాద్ హాజరైయ్యారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు క్రైస్తవ సమాజం కొరకు తన వంతు సహాయమును అందించడం జరుగుతుందని అదే విధంగా పాస్టర్స్ గౌరవ వేతన బకాయిలు త్వరలో విడుదల చేయడం జరుగుతుందన్నారు. అనంత నియోజకవర్గంలోని పాస్టర్లు వారికి ఏ అవసరం వచ్చిన పార్టీ కార్యాలయంలో తనను వ్యక్తిగతంగా వచ్చి కలువచ్చాన్నారు. అనంత అర్బన్ పరిధిలో గల చర్చిల నిర్మాణానికి,కాంపౌండ్ వాల్ ఏర్పాటుకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తాన్నన్నారు. నా గెలుపుకు కృషి చేసిన ప్రతి పాస్టర్‌కు,పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సంఘంకు కృతజ్ఞతాలు తెలియజేయడం జరుగుతుందన్నారు.ఈటే స్వామిదాస్ మాట్లాడుతూ అనంత అర్బన్‌లో ఉన్న ప్రతి పాస్టర్ గౌరవ వేతనం కొరకు దరఖాస్తు చేసుకోవాలని,త్వరలో వారికి సంబందించిన అప్లికేషన్లు స్వీకరించబడతా యన్నారు. క్రిష్టియన్ మైనార్టీ కార్పోరేషన్ నుండి నిధులు కేటాయించుటకు కృషి చేస్తాన్నారు.అనంతరం ఎమ్మెల్యే దగ్గుపాటీ చేతులు మీదుగా 21 మంది పాస్టర్లకు ఒక్కోక్కరికి వేయి చొప్పున ఆర్థిక సహాయంను అందజేశారు.అసోసియేషన్ తరుపున అతిధులకు శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమ ంలో అసోసి యేషన్ గౌరవ అధ్య క్షులు బందెలరాజు, సలహా దారులువై. పిబాబు,పి. మార్కు,మనష్షే,జీఆర్. ఆనంద్,జీవన్‌బాబు,రూఫస్ కుమార్, శాంతవర్ధన్, జహం గీర్ జాషువా,వాసు అనిల్‌కాం త్,అధిక సంఖ్యలో దైవసేవకులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే దగ్గుపాటీ ప్రసాద్‌ను సన్మానిస్తున్న పాస్టర్స్.

## అట్టహాసంగా ప్రారంభమైన పల్లె పండుగ కార్యక్రమం



పల్లె పండుగ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న దృశ్యాలు

కూడేరు, అక్టోబర్ 14 ప్రభాతవార్త

కూడేరు మండల కేంద్రంలోని కూడేరు, ఇప్పేరు పంచాయితీలోని ముద్దలాపురం గ్రామాలకు సంబంధించి సోమవారం పల్లె పండుగ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలో స్థానిక టిడిపి సర్పంచు మీనుగ లలితమ్మ ఉపాధిహామీ పథకం ద్వారా 35 లక్షల రూపాయలతో నిర్మించే సిమెంట్ రోడ్ల పనులకు భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు. ముద్దలాపురం గ్రామంలో కూడా 7.5 లక్షల సిమెంట్ రోడ్డు పనులను ప్రారంభి ంచడం జరిగింది. ఈ కార్యక్రమంలో పంచాయితీరాజ్ డీఈ రసూల్, ఎంపిడిఓ కుళ్లాయిస్వామి, పిఆర్ఏఈ రమణయ్య, ఏపిఓ తులసి ప్రసాద్, టిడిపి నాయకులు పంచాయితీ కార్యదర్శిలు ఉపాధిహామీ సిబ్బంది, సచివా లయ సిబ్బంది, తేదేపా నాయకులు జయప్రకాష్ గౌడ్, బాట వెంకటేష్, బొమ్మయ్య, వెంకటేష్ యాదవ్, బోయ నారాయణస్వామి, సర్పంచు భర్త చిన్న ఈశ్వరయ్య, నాగరాజు, నాగభూషణం, చంద్ర, శివ, తదితరులు పాల్గొన్నారు.

## రాయలసీమ మహా సమ్మేళనం

అనంతపురం, అక్టోబర్ 14 ప్రభాతవార్త బ్యూరో

రాయలసీమ సాంస్కృతికోద్యమంలో భాగంగా నిర్వహిస్తున్న ఎనిమిదవ రాయలసీమ మహాకవి సమ్మేళనంలో కవులందరూ భాగస్వాములై జయప్రదం చేయాలని రాయలసీమ సాంస్కృతిక వేదిక సమన్వయకర్త డాక్టర్ అప్పిరెడ్డి హరినాథరెడ్డికోరారు. రాయలసీమ రత్నాలు పేరున కొనసాగే ఈ కవి సమ్మేళనంలో విభిన్న రంగాల సీమ ప్రముఖులపై కవితలను రాసి డిసెంబర్ 8వ తేదీలోగా 9963917187 వాట్సాప్ నెంబర్‌కు పంపాలని తెలిపారు. భావితరాలకు సీమ ప్రముఖుల కృషిని, స్ఫూర్తిని కవితల ద్వారాచాటుతామని తిమ్మాపురం బాలకృష్ణారెడ్డి, మెట్టుపల్లి సుదర్శనరెడ్డిల స్మారకంగా డిసెంబర్ నెలలో కవి సమ్మేళనం నిర్వహిస్తామని వేదిక సభ్యులు రవికుమార్, వాసంతి, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

## అక్కంపల్లి,కందుకూరు,ఇటుకలపల్లిలో పల్లె పండుగ వారోత్సవం

అనంతపురం రూరల్,అక్టోబర్14ప్రభాతవార్త:

అనంత రూరల్ మండలం ఇటుకలవల్లి, కందుకూరు గ్రామాల్లో ఈఓఆర్‌డీ వెంకట నాయుడు టీం, అక్కంపల్లి, కురుకుంట గ్రామాలల్లో ఏపిఓ చంద్రకళ టీం అక్కంపల్లి గ్రామ సర్పంచ్ మల్లెల పుష్పవతి లింగమయ్య, ఇటుకలపల్లిలో గ్రామ సర్పంచ్ భాస్కర్‌రెడ్డి,కందుకూరులో గ్రామ సర్పంచ్ ప్రశాంత్ కుమార్,స్థానిక నాయకుల ఆధ్వర్యంలో పల్లె పం డుగ వారోత్సవ కార్యక్ర మంను అధికారులు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో సర్పంచులు,స్థానిక నాయకులతో కలసి అధికారులు పలు అభివృద్ధి కార్యక్రమాలకు భూమి పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శులు అశోక్‌బాబు,హిదయతుల్లా, మహమ్మద్ రఫి,మల్లికార్జున,బాలన్న,సచివాలయ ఉద్యోగులు,స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.


అక్కంపల్లిలో పల్లె పండుగ వారోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం.

# గ్యారంటీ యోజనలకు, అభివృద్ధి పనులకు నిధుల కొరత లేదు

## - సండూరు తాలూకా సాధనా సమావేశంలో ముఖ్యమంత్రి సిద్ధరామయ్య


సండూరు తాలూకా సాధనా సమావేశంలో ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి సిద్ధరామయ్య


సమావేశంలో పాల్గొన్న ప్రజలు

బళ్లారి, అక్టోబర్14, ప్రభాతవార్త;

గ్యారంటీ యోజనల నుంచి రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి జరుగుతున్నది. వివిధ అభివృద్ధి కార్యాలకు ఎలాంటి నిధుల కొరత లేదని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య స్పష్టం చేశారు. జిల్లాలోని సండూరు పట్టణంలో సోమవారం జరిగిన సండూరు తాలూకా సాధనా సమావేశంలో పాల్గొని వివిధ అభివృద్ధి పనుల శంకుస్థాపన, యోజనలకు శ్రీకారం చుట్టి మాట్లాడారు. సండూరు ప్రాంతంలో రూ.280 కోట్ల వ్యయంతో వివిధ యోజనల పనులకు శంకుస్థాపన చేసినట్లు, 2004 నుంచి 2024 వరకు రూ.1216 కోట్లు నిధులు కేటాయించడం జరిగింది. తాలూకాలోని 58 గ్రామాలకు రూ.160 కోట్ల వ్యయంతో నిడుగుర్తితో సహా గ్రామాలకు బహుగ్రామ తాగునీటి సౌలభ్యం కల్పించే బృహత్ తాగునీటి సరఫరా పనులకు శ్రీకారం చుట్టినట్లు చెప్పారు. 2013లో తమ కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవధిలో రాష్ట్రంలో సుమారు 15 లక్షల ఇళ్లను కట్టే లక్ష్యం పెట్టుకోగా, సండూరు తాలూకాలోనే 12 వేల ఇళ్లను నిర్మించినట్లు, సండూరు తాలూకా సమగ్ర అభివృద్ధికై తమ ప్రభుత్వం రూ.1216.38 కోట్లు నిధులను విడుదల చేయడం ద్వారా తాలూకా సమగ్రాభివృద్ధికి నిధుల వినియోగం జరుగుతుందని వెల్లడించారు. జనసంఖ్యకు అనుగుణంగా ఎస్సీ, ఎస్టీవర్గాల అభివృద్ధికై నిధులు కేటాయించినట్లు, ఆ ప్రకారం నిధులు ఖర్చు చేయడం జరుగుతుందని తెలిపిన సీఎం, దేశంలోనే ఎస్సీ, ఎస్టీ చట్టాన్ని జారీలోకి తెచ్చిన రాష్ట్రం మనదేనని, ఎస్సీ, ఎస్టీల అభివృద్ధికై రూ.33,182 కోట్లు కేటాయించడం జరిగిందన్నారు. ఎన్నికల ప్రణాళికలో ప్రకటించినట్లుగా తమ ప్రభుత్వం ఏర్పడిన ఎనిమిది నెల్లలో ఐదు గ్యారంటీ యోజనలు విజయవంతంగా జారీలోకి తెచ్చినట్లు తెలిపిన సీఎం, గృహలక్ష్మి యోజన కింద 1.21 కోట్ల మంది మహిళలు ప్రతినెలా రూ.2 వేలు పొందుతున్నారు. గృహజ్యోతి యోజన కింద రాష్ట్రంలోని 1.60 కోట్ల ఇళ్లకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌ను ఇస్తున్నట్లు, రెండు సంవత్సరాలపాటు నిరుద్యోగ డిగ్రీ, డిప్లొమా విద్యావంతులకు ప్రతినెలా వరుసగా రూ.3 వేలు, రూ.2 వేలు చొప్పున జమ చేస్తున్నట్లు చెప్పారు. కేంద్రం నుంచి కర్ణాటక రాష్ట్రానికి రావాల్సిన పన్ను డబ్బు వాటాలో రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరుగుతుందని, ఇందు కోసం తాము పోరాటం చేస్తున్నట్లు, దేశంలోనే అధికంగా పన్ను చెల్లించే రాష్ట్రంగా మన రాష్ట్రం ఉంది. అయితే మనకు దక్కాల్సిన వాటా కేంద్రం ఇవ్వడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర కార్మికశాఖ మంత్రి సంతోష్‌లాడ్ మాట్లాడుతూ గతంలో 2013-18లో తమ కాంగ్రెస్ ప్రభుత్వం నుంచి 15 లక్షల ఇళ్లు నిర్మించామని, సండూరులోనే సుమారు 12 వేల ఇళ్లను నిర్మించినట్లు చెప్పారు. ఆనాడు సండూరు ఎమ్మెల్యేగా ఉన్న నేటి ఎంపీ ఇ.తుకారామ్ గారే ఇందుకు కారణమని, ఈ కీర్తి అంతనికే చెందుతుందని చెప్పారు. సండూరు క్షేత్రం అభివృద్ధికి ప్రభుత్వం తగినన్ని నిధులను మంజూరు చేసిందని, బళ్లారి జిల్లాలో హెచ్చు నిధులు పొందిన క్షేత్రం సండూరేనని, దీనికి మూల కారకుడు ఎంపీ తుకారామ్ అని చెప్పారు. ఇప్పుడు రూ.1216 కోట్ల వ్యయంతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టడం జరుగుతుందని వివరించారు. సమావేశంలో డీసీఎం డి.కె.శివకుమార్, విజయనగర జిల్లా ఇన్‌చార్జి మంత్రి జమీర్‌అహ్మద్‌ఖాన్, రాష్ట్ర పీడబ్ల్యూడీ శాఖ మంత్రి సతీష్‌జారి కెహోళె, ఎమ్మె ల్యేలు నారా భరత్‌రెడ్డి, జె.ఎన్. గణేష్, బి.ఎం.నాగరాజ్, డా.శ్రీని వాస్, లతా మల్లికార్జున, కేఎంఎఫ్ అధ్యక్షుడు భీమానా యక్, లిడ్కర్ అధ్యక్షుడు ముండ్రగి నాగరాజ్, జిల్లాధికారి ప్రశాంత్‌కుమార్ మిశ్రా, జిల్లా ఎస్పీ డా.శోభారాణి, వివిధశాఖల జిల్లాస్థాయి అధికారులు, సార్వజనికులు పాల్గొన్నారు.

## ఎంజెపి ఏపిబిసిడబ్ల్యూ స్కూల్‌కు ఐఎస్ఓ సర్టిఫికెట్

నార్పల, అక్టోబర్ 14 ప్రభాతవార్త

నియోజకవర్గ పరిధిలోని నార్పల మండల కేంద్రంలో ఉన్న ఎంజెపి ఏపిబిసిడబ్ల్యూ రెసిడెన్షియల్ స్కూల్‌కు దేశంలోనే ఐఎస్ఓ 90012 015 సర్టిఫికెట్ సాధించిన మొట్టమొదటి ప్రభుత్వ రెసిడెన్షియల్ బాలికల పాఠశాల గా గుర్తింపు లభించింది. సోమవారం జిల్లా కేంద్రంలో కలెక్టర్ కార్యా లయంలో జిల్లా కలెక్టర్ డా.వి. వినోద్‌కుమార్ చేతులు మీదుగా పాఠశాల కన్వీనర్ సంగీత కుమారి ఐఎస్ఓ సర్టిఫికెట్ అందుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పాఠశాలలో పని చేసే వంట మనుషుల నుంచి హెడ్ మిసెస్ వరకు, పిల్లల నుంచి వారి తల్లిదండ్రుల వరకు ప్రతి ఉపాధ్యా యులు శ్రమ ఫలితమే మొట్టమొదటి ఐఎస్ఓ సర్టిఫికెట్ నార్పల ఎంజెపిఏపి బిసి డబ్ల్యూ రెసిడెన్షియల్‌కు రావడానికి కారణమన్నారు.


: కలెక్టర్ చేతులు మీదుగా ఐఎస్ఓ సర్టిఫికెట్ అందుకుంటున్న దృశ్యం

## నార్పలలో పల్లె పండుగ వారోత్సవాలు

నార్పల, అక్టోబర్ 14 ప్రభాతవార్త

నార్పల మండల కేంద్రంలో సోమవారం పల్లె పండుగ వారోత్స వాల్లో భాగంగా సోమవారం భూమి పూజను అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు చేశారు. ఉపాధి హామీ పథకం ద్వారా సిసి రోడ్ల నిర్మాణానికి మినీ గోకుళం నిర్మాణానికి 88.85లక్షలతో సిసి రోడ్ల నిర్మాణానికి, మినీ గోకుళాల నిర్మాణాలు చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షురాలు ఆకుల అరుణమ్మ, డిఎల్‌డిఓ లలితాభాయి, మండల ప్రత్యేక అధికారి రామసుబ్బారెడ్డి, ఎంపిడిఓ గంగావతి, ఈఓఆర్డి శైలజారాణి, సర్పంచు సుప్రియ, ఉపాధిహామీ ఏపిఓలు ఎర్రమ్మ, రమేష్, రామారావు, పంచాయితీ కార్యదర్శి శ్యామల, టిడిపి నాయకులు ప్రతాప్‌చౌదరి, ఆకుల కిషోర్, ఇంజినీరింగ్ అసిస్టెంట్ రంజిత్ తదితరులు పాల్గొన్నారు.


సిసి రోడ్ల నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న దృశ్యం

## ఎంఈఓలను కలిసి సన్మానించిన యుటిఎఫ్ జిల్లా, మండల నాయకులు

కూడేరు, అక్టోబర్ 14 ప్రభాతవార్త

కూడేరు మండల విద్యాశాఖ అధికారిగా బాధ్యతలు చేపట్టిన మహ్మద్ గౌస్, ఎంఈఓ-2గా ఉన్న టువంటి సాయికృష్ణని సోమవారం రోజు మండల విద్యాశాఖ కార్యాలయంలో యుటిఎఫ్ జిల్లా మండల నా యకులు, సభ్యులు వారిని మర్యాద పూర్వకంగా కలిసి పూలహారాలు,శాలువాలతో సత్కరించి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మండల ంలోని ఉపాధ్యాయుల సమస్యలను దృష్టిలో ఉంచుకుని వాటిని పరిష్కరించే విధంగా కృషి చేయాలని, సెప్టెంబర్ నెల జీతాలు వచ్చేలా చేసి యూనియన్ కోఆర్డినేషన్ సమావేశం ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు, ఉపాధ్యాయులు సిద్దన్న, చంద్రమోహన్, వెంకటప్ప, సంపత్, చంద్రశేఖర్, దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.


సన్మానిస్తున్న దృశ్యం

## అభివృద్ధి పనులతో పల్లె ప్రగతికి బాటలు వేస్తాం

( మొదటి పేజీ తరువాయి ) మండిపడ్డారు. జగన్ తనస్వార్థంతో పంచాయతీలను నిర్వీర్యం చేశారని, టిడిపి కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కళాణ్‌లు ప్రత్యేక చొరవ తీసుకొని రాష్ట్ర వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో అభివృద్ధి పనులకు బీజం వేశారన్నారు. ఇకపై గ్రామాల్లో ప్రగతి పుంజుకుంటుదని, అందుకు ప్రజల సహకారం ఎంతో అవసరమన్నారు. ఈ కార్యక్రమంలోకొత్తచెరువు టిడిపి,జనసేన, బిజెపి పార్టీల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

**CHANGE OF NAME**

I, MADAR NAYAK SUMIYA my husband name MADAR NAYAK MOHAMMED ALI KHAN (Old Name) Residing at Door No 10-752-2, Nagaraj Street, Kadiri Town, Sri Satya Sai District, AP-515591. do hereby declare that I have changed my husband name as from MADAR NAYAK MOHAMMED ALI KHAN (Old Name) to **MADAR NAYAK MOHAMMAD ALI KHAN** (NEW NAME) hence forth my husband name being called as **MADAR NAYAK MOHAMMAD ALI KHAN** for all purposes.

